సురేష్ మాట్లాడలేదు. క్షణక్షణానికి భయం పెరిగిపోతోంది. ముందు అతని రూపం, తరువాత అతని పద్ధతులూ, ఇప్పుడు అతని సంతకం. ఏం జరగబోతోంది? తనెందుకువన్నీ చేయటం?

"ఏమిటి ఆలోచిస్తున్నావు మిష్టర్ సురేష్! ఇదంతా ఎందుకు చేయాలీ అని కదూ? వినయ్ కూడా ఈ వివరాలు తెలుసుకోవాలనే తొందర పడ్డాడు పూర్ ఫెలో! ఏ లోకంలో వున్నాడోగాని......"

ఆ పేరు వినబడగానే శరీరం శీతలం కమ్ముతోంది.

"ఉద్యోగం అన్నాక వుద్యోగమే సురేష్ ! సైడ్ ట్రాక్‌లో కెళ్లకూడదు. సహదేవ్ యిష్టపడడు అలాంటిది గుడ్‌నైట్!"

అతను వెళ్ళిపోయాడు.

రాత్రి చాలాసేపు నిద్రపట్టలేదు అతనికి. క్షణక్షణానికి తులసి గుర్తుకొస్తోంది. తను ఘోరమయిన తప్పు చేశాడు.

డబ్బుకోసం- తులసి లాంటి ఒండర్‌ఫుల్ గాళ్ సాన్నిధ్యం వదులుకుంటారా ఎవరయినా? ఆరు నెలలు కాదు, ఆరు రోజులు కూడా ఎక్కువే!

ఉదయం డ్రస్ చేసుకుంటుండగా గదిలోంచి వచ్చిందా యువతి మళ్ళీ.

"గుడ్‌మార్నింగ్" అందామె చేతిమీదున్న చిలుక.

"డ్రస్‌లన్నీ చక్కగా సరిపోతున్నాయనుకుంటాను కదూ?"

నవ్వుతూ అడిగిందామె.

"ఆ! అవును!" నిజంగానే ఆ ఖరీదయిన డ్రస్‌లు తనకు అద్భుతంగా సూటవుతున్నాయ్.

"రాత్రి సినిమా చూశారనుకుంటాను. అన్నీ ఈజీ మూమెంట్స్ సురేష్. మీలాంటి యింటలిజెంట్ పర్సన్ తేలిగ్గా అనుకరించగలడు అర్జున్‌ని."

"అఫ్‌కోర్స్! అఫ్‌కోర్స్!"

"విష్ణు!" పిలిచిందామె.

"ఎస్ మేడమ్!" అంటూ తన చేతిలోని ఫైల్ టేబుల్‌మీదుంచాడతను.

"ఇలా వచ్చి ఇక్కడ కూర్చోండి సురేష్" పిలిచాడతను.

అతను వెళ్ళి టేబుల్ ముందు కుర్చీలో కూర్చున్నాడు. ఎదురుగా ఓ కాగితం మీద నల్లని యింక్‌తో సంతకం కనబడుతోంది. "కె.యస్. అర్జున్."

"ఈ సంతకాన్నే మీరు కాపీ చేయాలి. ఎంత అద్భుతంగా చేయాలంటే దానికి, మీ సంతకానికీ కొంచెం కూడా తేడా వుండకూడదు. బహుశా పర్‌ఫెక్ట్‌నెస్ రావాలంటే వారం రోజులు పూర్తి ప్రాక్టీస్ కావాలనుకుంటాను."

సురేష్ తల వూపాడు.

"ఇక ప్రారభించండి సురేష్ ! టైమ్ ఈజ్ షార్ట్" లేచి బయటకు నడుస్తూ అందామె.

"టైమ్ ఈజ్ షార్ట్" అంది చిలక కూడా!

వెనుకే విష్ణు కూడా వెళ్ళిపోయాడు.

సురేష్ పక్కనే వున్న పెన్ తీసుకుని ఎదురుగా వున్న పుస్తకం చూస్తూ కాపీ చేశాడు. చెయ్యి వణకటం చేత చాలా తేడా వచ్చింది.

కొద్ది గంటల్లోనే తెలిసివచ్చింది అతనికి .

సంతకాన్ని ఫోర్జరీ చేయటం అంత తేలిక కాదు.

కానీ తప్పదు. వాళ్ళిస్తానన్న లక్ష రూపాయల కోసం కాదు. తను వినయ్‌లాగా చంపబడకుండా వుండటానికి!

మరి కొద్దిసేపట్లో చేయి నొప్పి పుట్టసాగిందతనికి. వేళ్ళు లొంగడం లేదు. దానికితోడు లోలోపల భయం.

విష్ణు లోపలికొచ్చాడు.

సురేష్ ప్రాక్టీస్ చేసి పడేస్తున్న కాగితాల గుట్టవేపు చూసి నవ్వాడు.

"వెరీగుడ్ ప్రాక్టీస్ సురేష్ ...." మెచ్చుకుంటున్నట్టుగా చూశాడు.

సురేష్‌కి నమ్మకం తగ్గిపోతోంది.

ఎంత ప్రయత్నించినా కాపీ చేయలేకపోతున్నాడు. ఒకవేళ తను సంతకం సాధించలేకపోతే ఏం జరుగుతుంది? తనను వదిలేస్తారా? లేక- ఈ విషయాలన్నీ తెలుసుకున్నందుగాను...తనూ కారు ప్రమాదంలో చనిపోతాడా?

విష్ణు దగరికొచ్చి అతను అప్పుడే చేసిన సంతకం చూశాడు.

"ఫర్వాలేదు. కొద్ది గంటల్లో ఇంత ఇంప్రూవ్‌మెంట్ వుందంటే దటీజ్ సమ్‌థింగ్"

కొంత ధైర్యం  వచ్చిందతనికి.

"ఈ లెక్కలో నాలుగు రోజులు చాలనుకుంటాను" సురేష్ భుజం తడుతూ అన్నాడు విష్ణు.

"ఆ అమ్మాయి ఎవరు?" అడిగాడు సురేష్ చనువు తీసుకుంటూ.

"మేడమ్ ఎవరో తెలీదా?"

"ఎవరూ చెప్పలేదూ. అడుగుదామంటే-వెల్-అడక్కూడదు"

"అఫ్‌కోర్స్! వివరాలన్నీ మీకనవసరం. పేరు మాధురి. మిసెస్ అర్జున్-మీకు చేతివేళ్ళు నొప్పి పుడితే కాసేపు రిలాక్సవచ్చు."

సురేష్ టేబుల్ ముందు నుంచి లేచి గదిలో కొద్దిసేపు పచార్లుచేశాడు. తరువాత బాత్

రూమ్‌లోకెళ్ళి పంపుకింద చేయి వుంచి నీళ్ళు వదిలాడు కాసేపు.

నొప్పులు చాల వరకూ తగ్గిపోయినయ్.

"ఈవాళ మనిద్దరం కలసి భోజనం చేద్దాం సురేష్ ! మన స్నేహాన్ని సెలబ్రేట్ చేసుకుందాం!"

విష్ణు మాటలు చాలా ఉదారంగా వున్నాయ్. అతనిని నమ్మవచ్చో, నమ్మకూడదో తెలీటం లేదు. భోజనాలు ముగిశాక మళ్ళీ సంతకం ఫైల్ తెచ్చి అతని ముందుంచాడు విష్ణు.

"టైమ్ ఈజ్ షార్ట్ సురేష్! ఇంకాసేపట్లో సహదేవ్ వస్తున్నాడు ఎంతవరకూ ప్రావీణ్యం సంపాదించావో చూడ్డానికి"

మళ్ళీ ప్రాక్టీస్ మొదలుపెట్టాడు సురేష్ .

కొద్ది సేపు గడిచాక విష్ణు లోపలికొచ్చి డోర్ తెరచి పట్టుకున్నాడు. సహదేవ్ లోపలికొచ్చాడు. అతని ముఖం అలాగే వుంది ఎక్స్‌ప్రెషనూ లేకుండా- భయంకరంగా.

"హలో సురేష్ ! చాలా ఫాస్ట్‌గా అన్ని విషయలూ పికప్ చేసుకుంటున్నావని విష్ణు చెప్పాడు. ఐయామ్ వెరీ హాపీ!" అంటూ దగ్గర కొచ్చి అతను ప్రాక్టీసు చేస్తున్న సంతకం చూశాడు. కొద్ది క్షణాలు ఒరిజినల్‌నీ, సురేష్ చేసిన సంతకాన్ని పరీక్షించాక "గుడ్" అన్నాడు సంతృప్తిగా.

మరో రెండు రోజులు అర్జున్‌ని వీడియో క్యాసెట్లో చూడటం. అతని కదలికల్ని గొంతుతో సహా ప్రాక్టీస్ చేయటం, సంతకం నేర్చుకోవటంతో చాలా బిజీగా గడిచిపోయింది. ఆ రెండు రోజుల్లోనూ విష్ణుతో కొంత చనువేర్పడింది సురేష్‌కి.

అతనితో మంచి స్నేహం చేసుకుంటే తనకేమైనా వుపయోగపడతాడేమో అనిపిస్తోంది.

"ఒకసారి వెళ్ళి మా తులసిని చూసి రావాలనుంది విష్ణూ. ఆమె ఒక్క ర్తి ఎలా వుందో ఏమో?" అన్నాడతను ఒక రోజు.

"ఈ ఉద్యోగం ముగిసేవరకూ ఆమెను మర్చిపోవాలి. సహదేవ్ ఈ విషయంలో చాలా నిర్దాక్షిణ్యంగా ప్రవర్తిస్తాడు. అంచేత అసలా ఆలోచనలే మనసులోకి రానీకు!" అన్నాడు విష్ణు నవ్వుతూ.

అతను నిరాశ పడిపోయాడు.

ఆ సాయంత్రానికి విష్ణు ఓ చిన్న ప్యాకెట్టు తీసుకొచ్చి సురేష్ మీదకు విసిరేశాడు.

"మీ తులసిని చూడాలనుందన్నావు కదా! యాజే ఫ్రెండ్-నీ కోసం ఈ ఏర్పాటు చేశాను."

ఆత్రుతగా ప్యాకెట్టు విప్పాడు అతను

లోపల తులసి ఫోటోలు.. ఆమె మార్కెట్లో నడుస్తున్నప్పుడు- ఇంట్లో గంగాభవానితో మాట్లాడుతున్నప్పుడు, సాయంత్రం కిటికీ దగ్గర నిలబడి రోడ్డు వైపు దిగులుగా

చూస్తున్నప్పుడూ-

అతని మనసంతా వికలమైపోయింది. తులసి కోసమే తను ఇదంతా చేశాడు. అయినా ఆమె సంతోషంగా వున్నట్లు లేదు- ఆ ఫోటోల్లో.

ఆ రాత్రంతా అతనికి నిద్రలేదు. ఫోటోలో తులసి దిగులుగా వుంటే గంగాభవాని నవ్వుతోంది. ఏదో కామెంట్ చేస్తూ నవ్వుతూంది. ఏమయి వుంటుందామె కామెంట్?

"ఎవరో కొత్త అమ్మాయిని కలిపేసుకుంటాడులే-ఆ తెలివి చాలా వుంది" అంటోందా?

మరో రోజు గడిచిపోయింది.

మిసెస్ మాధురి కనిపించటంలేదు.

ఆ రోజంతా అర్జున్ కుర్చీలో కూర్చోవటం. మాట్లాడటం నడవటం బాగా ప్రాక్టీస్ చేయించాడు విష్ణు. అ తర్వాత రెండు రోజులకు వచ్చింది మాధురి.

"గుడ్‌మాణింగ్" అందామె చేతిమీద చిలుక.

ఆమె నవ్వింది.

"విష్ణు చెపుతున్నాడు-మీ ట్రైనింగ్ పూర్తి అయిందని"

సురేష్ ఇప్పుడు కొంత రిలాక్స్ అయ్యాడు- ఆ భవనంలోకి వచ్చాక ఆమె వంకపరీక్షగా చూశాడు.

"28.20.24" అనుకున్నాడతను. కళ్ళల్లో విపరీతమయిన సెక్స్ వుంది. తను చాలా అందమయిన అమ్మాయిలను చూశాడు గానీ సెక్స్ అపీల్ చాలా తక్కువమందికి వుంది. గంగాభవానీ కూడా కొంత సెక్సీగా వుంటుందిగానీ యింత విపరీతమైన ఆకర్షణ ఎవరికీ వుండదు.

అతను తనవంకే చూడటం గమనించింది మాధురి.

"మీరు అన్నింటిలోనూ చాల ఫాస్ట్ అని విష్ణు చెపుతున్నాడు" నవ్వుతూ అందామె.

"అవును! నా గాళ్‌ఫ్రెండ్స్ కూడా అదే మాట చెప్పారు."

ఆమె కొంచెం పజిల్ అయిన చూసింది.

"ఓ మీకు గాళ్‌ఫ్రెండ్స్ కూడా వున్నారన్నమాట" ఆసక్తిగా అడిగింది.

"ఐ లైక్ గాళ్ ఫ్రెండ్స్"

విష్ణుకి ఆ సంభాషణ నచ్చినట్లు లేదు.

"మేడమ్ నిన్ను పరీక్షించడానికి వచ్చారు సురేష్ - నువ్వెంత బాగా అర్జున్‌గారిని అనుకరిస్తున్నావో చూడ్డానికి."

సురేష్ లేచి నిలబడ్డాడు.

అర్జున్ లాగా గదిలో పచార్లు చేశాడు. చేతులు పాంట్ జేబులో పెట్టుకుని, కుర్చీలో

కూర్చుని ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు నటించాడు. గొంతు ఇమిటేట్ చేశాడు. టేబుల్ మీదున్న కాగితం మీద సంతకం చేశాడు.

మాధురి ముఖంలో ఆనందం స్పష్టంగా తెలుస్తోంది.

"ఎక్సలెంట్" అందామె ఆఖర్లో "భార్యనయుండి నేనే తేడా కనిపెట్టలేకపోతున్నాను."

"సహదేవ్‌గారు రేపట్నుంచే సురేష్‌ని ఆఫీస్‌కి తీసుకెళ్దామంటున్నారు మేడమ్" అన్నాడు విష్ణు.

"తీసుకు వెళ్ళవచ్చు. హి ఈజ్ పర్‌ఫెక్ట్ నౌ."

"హి ఈజ్ పర్‌ఫెక్ట్ నౌ" అంది చిలుక.